
వెళ్లిపోవాలి..మా వూరెళ్లిపోవాలి. గబగబా నాలుగు బట్టలు ఇస్త్రీవి ఎంచుకోవాలి. చెకచకా ట్రావెల్ బాగ్ సర్దుకోవాలి. ఆటో ఎక్కి బస్టాండులో పడాలి. మనూరెళ్లే బస్సు..ఎర్రబస్సుగానీ, పచ్చబస్సుగానీ..ఆర్టీసీదిగానీ, ప్రయివేటుదిగానీ గబగబా ఎక్కేసి వీలైనంత వేగంగా వెళ్లిపోవాలి...మావూరు! రూట్ల జాతీయకరణ కోసం మరే ఆర్భాటం కోసం ఆగకూడదు.



మొత్తానికి
రామాయణం, భారతం నించి తీసిన లాజిక్ ప్రకారం తీర్పులిచ్చేసే యజ్ఞం చేయని సోమయాజిగారున్నారు.

# మా వూరెళ్లాలి!

## -పురాణం శ్రీనివాసశాస్త్రి

మావూరెళ్లిపోవాలి. మావూరి బల్లకట్టులో నౌకవిహారం చేయాలి. మా వూరికి ముప్పయియిదేళ్ల పోరాటం తరువాత కాలవమీద కాలిబాట వంతెన పడింది. ఆ వంతెన మీద కాలవ ఇవతల నించి అవతలకీ, అవతలనించి ఇవతలకీ పనిలేకుండా తిరగాలి. కాస్సేపు గుళ్లో కూర్చొని మంచిగంధం, హారతి కర్పూరం కలిసిపోయిన గాలిని పీల్చాలి. అక్కడ నిలువు నామాల నల్లటి ముసలి పూజారి ఉండాలి-భక్తుల మీద కళ్లలో చావని ఆశతో! అతను ఆత్రంగా, కొంచెం ఆప్యాయంగా మన భోగట్టా అడిగి, మన పుట్టు పూర్వోత్తరాలు తవ్వి తీసి కొంచెం దగ్గరగా జరిగి ''అభిషేకం చేయించమంటారా తమరిపేర్న'' అని కొసరితే ''అలాగే కానివ్వండి'' అనాలి. దేవుడున్నా లేకపోయినా బక్క పూజార్లు, మంచి గంధం, హారతి కర్పూరం, అభిషేకమూ, శఠగోపాలూ ఉండి తీరాల్సిందే. నేనుండాలి. మావూరుండాలి. దేవుడుండాలి. పాపం ఆ ముసలి పూజారి ఇప్పుడున్నాడో లేడో-లేకపోతే అతని కొడుకుండాలి.

హైదరాబాద్‌లో ఎన్నయినా ఫైవ్‌స్టార్ హోటళ్లు వస్తే వచ్చుగాక..మావూళ్లో 1940లో వెలిసిందో పాక హోటల్...మావూరెళ్లాక, వంతెనమీంచి గుడికెళ్లాక, పూజారి పళ్లెంలో పది రూపాయలు వేసాక, తిన్నగా ఆ పాక హోటల్లో కెళ్లి బల్లమీద పడుండే కమ్యూనిస్టు పత్రిక చదువుకోవాలి. అన్నట్టు ఇప్పుడు కమ్యూనిజం లేదు. ఆ పత్రిక వస్తోందో లేదో! 1940ల నించి 80 ల దాకా మావూరి పాక హోటల్ కమ్యూనిజం చర్చలకి పెద్ద వేదిక. ఆ హోటల్ పెట్టిన ఫకీరు పోయాడు. వాడి కొడుకు పాక హోటల్‌ని డాబాగా మార్చాడు. బిజినెస్ బాగానే నేర్చాక వాళ్ల నాన్ననాటి ముసలి కమ్యూనిజాన్ని పాకలోంచి తోలేసాడేమో! ఆ కమ్యూనిస్టు పత్రిక స్థానంలో రంగుల హంగుల సినిమాపత్రిక డ్యూయెట్ చిత్రీకరణలో నలిగిపోయిన హీరోయిన్‌లా ఆయిల్ మరకలతో ఆ మూల బల్లమీద కనపడుతుందేమో! ఏదుంటే అది- మావూరెళ్లి, పాక హోటల్‌లో నలిగినదైనా సినిమాదైనా పత్రిక చదవాలి. అది మావూరి పత్రిక.

మరిచిపోయాను-

మావూరెడుతూ మధ్యలో పెరవలిలో దిగాలి. అక్కడ కాలవగట్టున పెంకుటింటి అరుగుమీద యంగ్‌విడో ( ఆమెని తప్పనిసరిగా ఏ పోస్టుమాస్టరు గారబ్బాయో ప్రేమించి పెళ్లి చేసుకొని ఉంటే పిల్లాపాపలు పుట్టి వళ్లు పెరిగి పెళ్లిళ్లయి ఆవిడ నుదుటిమీద ఎర్రరూపాయి కాసుతో పండిన గృహిణిలా కనపడొచ్చు) పిడకల పొయ్యి మీద వేడివేడిగా వండివారుస్తున్న ఇడ్లీలు పలచటివి పచ్చి మిరపకాయ పచ్చడిలో నంజుకుని తినాలి. ఆ రుచి వేరు. పెరవలి మావూరికి దగ్గరవుంది!

పోస్టుమాస్టరంటే గుర్తొచ్చింది. మావూళ్లో మా చిన్నప్పుడు పోస్టు పంతులుగారుండే వారు. ఆయనకో కొడుకు. వాడి కథే కథ. తండ్రికి సాయపడుతున్నట్టుగా పోస్టు డెలివరీకి తాను బయలుదేరి మనిఆర్డర్ సొమ్ము నొక్కేసేవాడు. అలా సంపాయించిన డబ్బుతో సంతపాకల్లో సారా తాగి ఊరంతా పేరు సంపాయించాడు. ''ఇదిగో నీకు పోస్టు వచ్చింది'' అంటూ మావూరి అబ్బాయిగారి కొత్తకోడలికి ఉత్తరం ఇచ్చొచ్చాడో రోజు. వట్టిది. అది తానే రాసిన వేడి వేడి ఉత్తరం. వాటిని ఆవిడ చేత చదివింపజేసి రాత్రి వచ్చిన రహస్యపు వానలో తడిసిన ఆనందం కలిగించాడు కాబోలు. ఓ రోజు ఇద్దరూ కలిసి ఉడాయించారు. అబ్బాయిగారు-వయస్సు 80 ఏళ్లు-మావూరి జమిందారు-ఏం చేయాలో తెలియక సోమయాజులుగార్ని పిలిపించారు. మావూరు ఆయన అబ్బాయిగారు పిలవనంపగానే వచ్చి అరుగుమీద బైఠాయించి గంభీరంగా దగ్గారు. ఊరి ముఖ్యులలో పెద్దకులాలవాళ్లు అరుగుమీద చిన్న కులాలవాళ్లు అరుగుకింద చావిడి పంచన కొలువుతీరారు. ఎవరో అందించిన తువ్వాలు భుజంమీద వేసుకుని పాడుందట్టించి సోమయాజులుగారు ''నిగమ శర్మండీ..బాబూ నిగమశర్మ'' అని చాటారు గట్టిగా. పాండురంగ మహత్మ్యంనించి నిగమశర్మోపాఖ్యానంలో పద్యం చదువుతూ నిగమశర్మ కథ ఎత్తుకున్నాడు. అబ్బాయిగారికి చిరాకొచ్చి 'చెస్' అని అడ్డుకున్నారు. ''మా కోడలు ముం... చేసిన పని ఏమన్నా బాగుందంటారా? దానికేం శిక్ష విధిస్తారో తేల్చండి'' అన్నారు అబ్బాయిగారు ఉబ్బసం మధ్య మాటలు పెకలించుకుంటూ. సోమయాజులుగారు వెంటనే నిగమశర్మ కథ విడిచిపెట్టి ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం కథ ఎత్తుకున్నారు. పారిపోయిన తన పెళ్లాం గురించి అబ్బాయ్‌గారబ్బాయ్ బెంగతో నోట్లో వేలేసుకుని మూగగా కూర్చుని తతంగం చూస్తున్నాడు. ఓ దళిత తవ్వాయి లేచి ''అబ్బాయిగారూ! మీ కోడలిగార్ని తరువాత శిక్షిందురుగాని, ఆవిడ దొరకాలిగందా? ముందు మీ అబ్బాయిగారి చేత నోట్లోంచి వేలు తీయించండి..'' అని పొగరుగా అనేసి రచ్చబండని వెలివేసి వెళ్లిపోయాడు. ఆ తరవాత కథ చాలా పెద్దదుంది. ఇలాంటి తీయటి కథలు ఎన్నో వున్నాయి. మావూరి చెరుకు తోటల్లో చెరుకు గెడలతోపాటు ఎన్నో



కథలు
పండుతాయి.
తీయటి కథలు..ఈ కథ ఏమీ
బాగాలేందటే నేనొప్పుకోను- ఇది మా వూరి
కథల్లో ఓ కథ. మావూరి కథకి ముగింపు
ముఖ్యం కాదు.

ఉదాహరణకి సోమయాజులుగారి కథే ఉంది. మావూళ్లో ప్రతి తలకాయకీ కథ ఉండాల్సిందే. సోమయాజులుగారి కొడుకూ, పెళ్లామూ మూణ్ణెల్ల తేడాలో పోయారు. వయసులో ఉన్న కోడలిని మామగారు చేరదీసారు. సోమయాజులుగారికి కొడుకూ, పెళ్లామూ లేకపోవచ్చుగాని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో క్లర్కుగా రిటైరైన చరిత్ర, మూడెకరాల కొబ్బరితోట, ఇద్దరు మనుషులకి ఏడాది సరిపడా నాలుగు బస్తాలు పండే మూడు కుంచాల మాగాణి, పెంకుటిల్లు, బోలెడంత తీరుబడీ ఉన్నాయి. 'పిల్లా' అని పిలిచేవాడు కోడల్ని. 'మామయ్యా' అని పిలిపించుకోనే చనువిచ్చాడు. ఇద్దరి మధ్య దిక్కుమాలినదేదో- అమలిన వ్యవహారం- బయలుదేరింది. తిరునాళ్లకి పోయి అటునించి సినిమాలు చూసొచ్చేవారు. సిద్ధాంతం దగ్గర వంతెనపడ్డంతో పంటపండినట్టయింది వాళ్లకి. భాగవద్గీతోపన్యాసాలంటూ చీటికీ మాటికీ అమలాపురం బస్సెక్కి- వెళ్లి సినిమాల నుంచి నేర్చుకున్న ప్రకారం అక్కడ ఉన్న ఏకైక పార్కులో కబుర్లాడుకుని వచ్చేవాళ్లు. వాళ్లిద్దరికీ హఠాత్తుగా మావూరు చిన్నదైపోయింది. మావూరి చెరుకుతోటల్లో పార్కులు లేనందుకు బాధపడ్డట్టు ఇటు నరసాపురం, అటు అమలాపురం, లేకపోతే తాడేపల్లిగూడెం వెళ్లి వస్తూ ఉండేవారు. మా వూరి గొప్పదనం ఓటుంది. ఏ రహస్యమైనా బట్టబయలు.

''రామాయణంలోనా, భారతంలోనా? ఎందులో లాజిక్ ప్రకారం మీరు మీ కోడలితో పార్కుల్లో తిరుగుతున్నారు?'' అంటూ కాలేజీ కుర్రాళ్లు పానంచాల రేవుదగ్గర సోమయాజులు గారు జంధ్యం ఒడుక్కుంటూ మంత్రం చదువుతుండగా నిలేసారు. ''నా ఇల్లు, నా పొలం, నా ఆస్తి'' అని సమాధాన మిచ్చారు సోమయాజులుగారు. మళ్లీ విషయం అరుగెక్కింది. సోమయాజులుగార్ని వెలివేసారు. పాపం ఆయన ఏమి మానాడో- ఏమి మానలేదో గాని-పార్కుల వేట మానాడు.

ఇలాగే అమాయకంగా ఉంటాయి మావూరి కథలు.

★★★★

''కొన్ని ఊర్లుంటాయి. వాటికి మనం పోగలం. మనూరు మనం పోలేం'' నాకో కవి మిత్రుడున్నాడు. వాడు నాకు దారిలో తారసపడి, ఇరానీ చాయ్ తాగించి మావూరువెళ్లాలన్న నా హడావుడి మీద నీళ్లు చల్లాడు పైమాటతో. వాడిది కూడా మావూరి దగ్గరే.

''ఇప్పుడు మీ వూళ్లో పాకహోటల్లో డైలీ లాటరీ నడుస్తోంది. కాలిబాట వంతెన పడ్డాక బల్లకట్టు మూలపడింది. వేసవిలో కాల్వ ఎండిపోయాక ఇసుకలో కూరుకుపోయి దాని అస్థిపంజరం కనిపిస్తుంది. పోస్టుమాస్టరు గారబ్బాయి మనీ ఆర్డర్లు కొట్టేస్తే ఊరుకునే సత్తెకాలపు వాళ్లు లేరు అక్కడ. అబ్బాయిగారు చచ్చిపోయాక అబ్బాయిగారబ్బాయ్- ఇంకా నోట్లోవేలు తీయకుండనే- బ్రాకెట్టాటలో ఆస్తి కరిగించేసాడు. ఎప్పుడో లేచిపోయిన అతని పెళ్లాం వేల్పూరులో కంపెనీ నడుపుతోంది. ఆట పాటల కంపెనీ. నర్సాపురం దగ్గర ఆయిలు పడడంతో రోడ్లమీద లారీల హడావుడి ఎక్కువైంది. సోమయాజులుగారు సైకిలు వెనక బియ్యపుమూటతో వస్తూ లారీ కింద పడి చచ్చిపోయారు. ఆయన కోడలు పాపం పిచ్చిదైపోయింది. ఎవరన్నా జాలితలిచి ఇంత ముద్దపడేస్తే వాళ్ల ఇంట్లో చాకిరీ చేస్తుంది. ఆయిలు కోసం ఊరిని ఆయిల్ కంపెనీ వాళ్లు తవ్వేస్తే, రొయ్యల చెరువులంటూ రైతులు పొలాలు తవ్వేసారు. ఈమధ్య రొయ్యల చెరువుల జోరు తగ్గింది. కానీ ఇప్పట్లో వాటిని పూడ్చినా పంటలు పండవు. ఇంకా...'' చెప్పుకుపోతున్నాడు మా కవి మిత్రుడు.

నేను వినడం మానేసాను.

నాకు అర్థమవుతోంది.. నేను మావూరెళ్లలేను.

మహాజనులారా!

నాది చాలా చిన్న కోరిక!

(మావూరెళ్లాలి! అంతే)

''మావూరిని నాకు ఇప్పించండి ప్లీజ్!!''

★